# త్యాగభావంతో సేవ చేసేవాడే నిజమైన వైద్యుడు

"ధర్మార్థకామమోక్షానాం ఆరోగ్యం మూల ముత్తమం" చతుర్విధ పురుషార్థ సాధనకు ఆరోగ్యం అత్యవసరం. ఆరోగ్యమే లేకుండిన మానవుడు ఎట్టి చిన్న కార్యమునందైనా పాల్గొనలేడు. ఆరోగ్యమును మించిన భాగ్యం మరొకటి లేదు. ఆరోగ్యమే మహాభాగ్యం.

భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు, సర్వవ్యాపి. "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అందరియందున్నది భగవంతుని అంశమే. భగవంతుడు సకల జీవులకు అంతో, ఇంతో శక్తిని ప్రసాదించాడు. అయితే మానవునికి మాత్రం అమితమైన శక్తిని అనుగ్రహించాడు. మానవుని శారీరకశక్తి అల్పమైనదిగాని, మానసిక శక్తి అమితమైనది. మానవుడు మనస్సులో సంకల్పించుకుంటే ఏమైనా సాధించగలడు. మనోశక్తితో మానవుడు సాధించలేని కార్యం ఈ జగత్తులో లేదు. తన సర్వశక్తుల నుపయోగించి లక్షలాది మైళ్ళు అంతరిక్షంలోకి ప్రయాణం సల్పుతున్నాడు. కాని, అరఇంచైనా తన హృదయాంతరాళంలోకి ప్రయాణిస్తున్నాడా? లేదు. హృదయాంతరాళంలోకి గొనిపోగల శక్తియే మానసికశక్తి. ఈ శక్తిని సక్రమమైన మార్గంలో ఉపయోగించుకోవాలి. తనయందు అట్టి శక్తి ఉన్నదని గుర్తించుకోలేక మానవుడు అనేకబాధలకు గురి అవుతున్నాడు. తన ముఖమును తాను చూసుకోవాలంటే ఒక అద్దం కావాలి కదా! అదేవిధంగా, దివ్యత్వమనే అద్దముద్వారానే మానవుడు తన శక్తిని తాను సంపూర్ణంగా అర్థం చేసుకోగలడు. ఒక చిన్న కట్టెముక్కను నిప్పులో వేస్తే, ఆ కట్టెముక్కకూడా నిప్పుగా మారిపోతుంది. అరచేతిలో ఒక చిన్న నీటిచుక్క వేసుకుంటే అది నిమిషంలో ఆవిరైపోతుందిగాని, అదే నీటిబిందువును సముద్రంలో వేస్తే అది సముద్ర స్వరూపాన్ని ధరిస్తుంది. అదేరీతిగా మీరు దైవానికి సమీపంగా పోయినప్పుడు, దైవంతో సన్నిహిత సంబంధబాంధవ్యాన్ని ఏర్పర్చుకున్నప్పుడు మీరుకూడా దైవస్వరూపులుగా మారిపోతారు. దీనిని పురస్కరించుకొనియే వేదాంతం "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అన్నది. మీరు ఎలాంటివారితో సంబంధమేర్పర్చు కుంటారో అలాంటి వారుగా రూపొందుతారు.

srisathyasaivachanamrutam

కాబట్టి, మీరు ఏర్పర్చుకునే సంబంధం ఉత్తమమైనదిగా ఉండాలి. మానవునియందు అన్ని శక్తులూ ఉంటున్నవి. కాని మానవుడు తనలోని శక్తులను తాను తెలుసుకొనలేక పోతున్నాడు, అర్థం చేసుకొనలేకపోతున్నాడు. అందువల్లనే తాను అల్పునిగా జీవిస్తున్నాడు.

## భగవంతుడేది కోరినా భక్తుల నిమిత్తమే

"అణోరణీయాన్ మహతోమహీయాన్" అణువు నుండి ఘనమువరకు భగవంతుడే వ్యాపించియున్నాడు. అయినప్పటికీ భగవంతునికికూడా కొన్ని కోరికలున్నాయి. అవి తన నిమిత్తం కాదు, భక్తుల నిమిత్తమే. భక్తుల జీవితాలను సార్థకం గావించే నిమిత్తమే భగవంతుడు తనకుకూడా కొన్ని కోరికలున్నట్లు నటిస్తాడు. దీనిని మీరు చక్కగా అర్థం చేసుకోవాలి. కుచేలుడు తనవద్దకు వచ్చినప్పుడు కృష్ణుడు "కుచేలా! నాకోసం ఏమి తెచ్చావు?" అని అడిగాడు. అతడు తెచ్చిన అటుకులు స్వీకరించి అతనికి సకల భోగభాగ్యములను అనుగ్రహించాడు. వామనమూర్తి బలిచక్రవర్తి వద్దకు పోయి మూడడుగుల నేల దానమడిగాడు. ఎందుకోసం? అతనిని తరింపజేయటానికే. ఒకనాడు కృష్ణుడు ఒక గోపిక ఇంటికి వెళ్ళి తనకు బాగా ఆకలిగా ఉందని అన్నాడు. భగవంతుడైన కృష్ణునికి ఆకలేమిటని ఆ గోపిక చాలా ఆశ్చర్యపడింది. "బ్రహ్మాండమంతయు బొజ్జలోనుండగ భక్ష్యభోజ్యము నీకు పెట్టనగునె?" అన్నది. "మీ ఇంట్లో ఉన్న నీళ్ళ మజ్జిగైనా సరే, ఒక గ్లాసులో పోసివ్వు. నాకదే చాలు" అన్నాడు కృష్ణుడు. ఆమెను తరింపజేయటానికే కృష్ణుడు ఈ కోరిక కోరాడు.

కారడవుల్లో కందమూలాదులను భుజిస్తూ కాలం గడుపుతున్న పాండవులవద్దకు ఒకనాడు దుర్వాసుడు తన వేలాదిమంది శిష్యులను వెంట పెట్టుకుని వెళ్ళి తన శిష్యులందరూ బాగా ఆకలితో ఉన్నారనీ, తాము నదికి వెళ్ళి స్నానం చేసి తిరిగి వచ్చేలోగా తమకు భోజనం ఏర్పాటు చేయవలసిందనీ చెప్పి వెళ్ళాడు. అంతమందికి పెట్టటానికి తమవద్ద ఏమీ లేదని ద్రౌపది చింతించి, ఎలాగైనా ఈ కష్టంనుండి గట్టెక్కించవలసిందిగా కృష్ణుణ్ణి ప్రార్థించింది. కృష్ణుడు ప్రత్యక్షమై "చెల్లీ! నాకు బాగా ఆకలేస్తోంది. తినటానికి ఏదైనా ఉంటే పెట్టు" అన్నాడు. అందుకు ద్రౌపది "కృష్ణా! మా పరిస్థితి నీకు తెలియనిదా? మేము హస్తినాపురంలో ఉన్నామనుకున్నావా? లేక, అరణ్యంలో ఉన్నామను కున్నావా? హస్తినాపురంలో ఉండియుంటే

sri sathyasai vahini amrutam

నీవేది అడిగినా పెట్టేదానను. కాని మేమిప్పుడు అరణ్యంలో ఉన్నాము; కందమూలాదులను భుజిస్తూ కాలం గడుపుతున్నాము. ఇలాంటి పరిస్థితిలో నేను నీకేమి పెట్టగలను?" అన్నది. "ద్రౌపదీ! నీవు కడిగివేసిన పాత్రలో ఏ కించిత్తైనా ఆహార పదార్థం మిగిలియున్నదేమో చూడు. నాకదే చాలు" అన్నాడు కృష్ణుడు.

ద్రౌపది తాను కడిగివేసిన పాత్రను పరిశీలించి చూడగా, దాని కంఠానికి ఒక చిన్న బలుసాకు కరుచుకొని కనిపించింది. దానిని తీసి కృష్ణునికి అర్పించింది. కృష్ణుడు దానిని స్వీకరించిన తక్షణమే దుర్వాసునియొక్క వేలాది శిష్యుల ఆకలికూడా తీరిపోయింది. కనుక భగవంతుడేది కోరినప్పటికీ అది భగవంతుని వద్ద లేక కాదు. సర్వమూ భగవంతుని ఆధీనంలోనే ఉన్నది. కాని భక్తులకు సహాయం చేసే నిమిత్తమై తాను అప్పుడప్పుడు కొన్ని కోరికలు కోరుతుంటాడు.

**భక్తులకోసం భగవంతుడేమైనా చేస్తాడు**

మీకు లైలా, మజ్నూ కథ తెలిసే ఉంటుంది. లైలా గొప్ప శ్రీమంతురాలు, మజ్నూ నిరుపేదవాడు. అయినప్పటికీ లైలా మజ్నూని ప్రేమించింది, అతణ్ణి వివాహం చేసుకోవాలని ఆశించింది. తానైతే మజ్నూని ప్రేమిస్తున్నదిగాని, అతడు నిజంగా తనను ప్రేమిస్తున్నాడా, లేదా అని ఆమెకు సందేహం కల్గింది. అతనిని పరీక్షించాలని ఇద్దరు దాసీలను పంపించింది. వాళ్ళు మజ్నూవద్దకు వెళ్ళి లైలాకు తీవ్రంగా జబ్బు చేసిందనీ, ఆమె ఆరోగ్యం బాగుపడాలంటే అతని రక్తం కొంత కావాలనీ అడిగారు. అందుకు మజ్నూ "కొంత రక్తమేమిటి? ఆమెకోసం నా ప్రాణాన్నే అర్పించటానికి సిద్ధంగా ఉన్నాను. ఆమె క్షేమంగా ఉండటమే నాకు కావలసింది" అన్నాడు. ఈవిషయాన్ని దాసీలు లైలాకు తెలియజేయగా ఆమె మజ్నూయొక్క ప్రేమను తక్కువగా అంచనా వేసినందుకు పశ్చాత్తాపపడింది. ఇదేరీతిగా ఈనాడు కొందరు భక్తులు తమ భక్తిని గొప్పగా భావిస్తూ, భగవంతుని ప్రేమను తక్కువ అంచనా వేస్తున్నారు. ఇది చాలా పొరపాటు. భక్తులకోసం భగవంతుడు ఏమి చేయటానికైనా సిద్ధంగా ఉంటాడు. భక్తుల క్షేమమే భగవంతుని ధ్యేయం. తానేది కోరినప్పటికీ భక్తుల నుద్ధరించే నిమిత్తమేగాని, తన నిమిత్తం కాదు. For others, not for Himself. ఈ సత్యాన్ని మీరు గుర్తించాలి.

srisathyasaivachanamrutam

## త్యాగబుద్ధి కల్గటం గొప్ప అదృష్టం

ఈ హాస్పిటల్‌ను ప్రారంభించిన డా॥ రాజేశ్వరి గురించి మీలో చాలామందికి తెలిసియుండవచ్చు కాని, ఇక్కడ క్రొత్తగా చేరినవారికి తెలియక పోవచ్చు. ఆమె సి. శ్రీనివాస్ (సెంట్రల్ ట్రస్ట్ మెంబర్) యొక్క తల్లి. ఆమె చదివిన చదువు చాలా గొప్పది. అమెరికా, జపాన్, జర్మనీ మున్నగు అనేక దేశాలలో పనిచేసి విశేషానుభవం గడించింది. ఆమె మొట్టమొదట ఈ హాస్పిటల్‌ను ఒక చిన్న గదిలో ప్రారంభించింది. ప్రతి సంవత్సరం ఒక్కొక్క నూతన విభాగాన్ని ప్రారంభిస్తూ క్రమక్రమేణ దీనిని ఇంత గొప్ప భవనంగా తీర్చిదిద్దింది. ఇది పేరుకు మాత్రమే చిన్న ఆసుపత్రినిగాని, ఇందులో అన్ని రకములైన వైద్యసదుపాయాలు లభిస్తున్నాయి. అలాంటప్పుడు ఇది చిన్న ఆసుపత్రి ఎట్లవుతుంది? కాదు. ఇది పెద్దదే! ఆకారంలో ఇది చిన్నది గాని, సేవలో చాలా గొప్పది. ఇందులో సేవ చేసేవారెలాంటివారో తెలుసునా? చాలా గొప్పవారు. బెంగుళూరు సిటీలో గొప్ప పేరు పొందిన డాక్టర్లు అనేకమంది ఇక్కడికి వచ్చి త్యాగభావంతో పల్లెప్రజలకు సేవలు చేస్తున్నారు. అలాంటి త్యాగబుద్ధి అందరికీ కలగదు, ఏ కొద్దిమంది అదృష్టవంతులకో ప్రాప్తిస్తుంది.

"నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః" పల్లెప్రజల సంక్షేమానికి పాటుపడాలనే సద్భావం డాక్టర్లలో కల్గటం చాలా అదృష్టం. ఈనాడు లోకంలో చాలామంది డాక్టర్లు డబ్బుకోసం ప్రాకులాడుతున్నారు. కాని, ఇక్కడ పనిచేసే డాక్టర్లు డబ్బునేమాత్రం ఆశించటం లేదు; పేషంట్లకు రోగనివారణ గావించి, వారికి ఆనందాన్నివ్వాలనే సద్భావంతో, సహృదయంతో సేవ చేస్తున్నారు. కనుక, ఈ ఆసుపత్రిని మించిన ఆదర్శవంతమైన ఆసుపత్రి మరొకటి లేదనే చెప్పవచ్చు. ఆసుపత్రి పేరుతో గొప్పగొప్ప భవనాలు కట్టవచ్చు. మేముకూడా ఇక్కడొక పెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టాము. కాని, అక్కడ వైద్యసేవలు హార్ట్ (గుండె)కు, బ్రైన్ (మెదడు)కు మాత్రమే పరిమిత మైనాయి. ఈ ఆసుపత్రి చిన్నదైనా ఇందులో అన్ని రకాలైన వ్యాధులకు చికిత్స చేస్తున్నారు. ఎంతో గొప్ప హృదయంతో చేస్తున్నారు! ఇక్కడికి వచ్చే పేషంట్లను చూస్తే మీకే తెలుస్తుంది.

ఒకరోజు ఉదయం వచ్చి చూడండి – ఇక్కడికి వచ్చేవారందరూ బీదప్రజలే. అలాంటివారికే

sri sathyasaivachanamrutam

మనం సేవలు చేయవలసింది. సేవ అంటే ఏమిటి? త్యాగభావంతో చేసేదే నిజమైన సేవ. యజ్ఞయాగాది క్రతువులకంటే సేవయే గొప్పది. అసలు యజ్ఞయాగాదులను ఎవరికోసం చేస్తున్నారు? మీకోసం చేస్తున్నారా? లేక భగవంతునికోసం చేస్తున్నారా? అవి మీకోసమేగాని భగవంతునికోసం కానే కాదు. భగవంతునికి అవి అవసరం లేదు. కొందరు లోకక్షేమంకోసం యజ్ఞం చేస్తున్నామంటారు. కాని నిజంగా చూస్తే తమ క్షేమంకోసమే చేస్తున్నారు. సమస్త లోకానికి క్షేమాన్ని చేకూర్చేవాడు భగవంతుడొక్కడే.

## వైద్యుల త్యాగనిరతి

త్రికరణశుద్ధిగలవాడే నిజమైన మానవుడు. ఈ ఆసుపత్రిలో డాక్టర్లు త్రికరణశుద్ధిగా సేవలు చేస్తున్నారు. డా॥ రాజేశ్వరి రాత్రింబవళ్ళు విశ్రాంతి లేకుండా పని చేసేది. "రాజేశ్వరీ! ఇతరులకు సేవ చేయాలంటే ముందు నీ ఆరోగ్యం బాగుండాలి కదా! కాబట్టి నీవు తగినంత రెస్టు (విశ్రాంతి) తీసుకో" అని చెప్పేవాడిని. అందుకామె "పేషంట్లకు సేవ చేయటమే నాకు రెస్టు స్వామీ!" అనేది. ఆమె ఈ ఆసుపత్రిలో సేవ చేస్తూ ప్రాణం వదలాలని ఆశించింది. అదేరీతిగా ఆమె సేవ చేస్తూ ఉండగానే కుర్చీలో కూర్చొని ప్రాణం విడిచింది. తరువాత డా॥ సావిత్రికూడా రాత్రింబవళ్ళు ఎంతో కష్టపడి పనిచేస్తున్నది. ఆమెకు తగినట్లుగా సిస్టర్ డాలీకూడా చాలా సేవ చేస్తున్నది. వీరు మాత్రమే గాక సిటీనుండి కళ్ళ డాక్టరు, పళ్ళ డాక్టరు, ఎముకల డాక్టరు మున్నగువారు అనేకమంది వచ్చి శక్తివంచన లేకుండా సేవ చేస్తున్నారు. అందరిలోనూ ఇలాంటి ప్రేమను పెంచాలన్నదే నా ఆశ. డాక్టర్లందరిలోనూ ఇలాంటి ప్రేమ అభివృద్ధి కావాలి. రోగులను ప్రేమతో ఆదరించి వారికి తగిన సేవ చేయాలి.

నేను డాక్టర్లకు మెమెంటోలు, సూటుగుడ్డలు అందజేసినప్పుడు అనుకోకుండా చిట్టచివరికి ఒక డాక్టరు వచ్చాడు. ఆయనకివ్వటానికి మెమెంటో లేదు. అది గమనించిన మరో డాక్టరు తక్షణమే తనకిచ్చిన మెమెంటోను తెచ్చి అందించాడు. ఇదెంత గొప్ప త్యాగభావమో చూడండి. ఇలాంటి త్యాగభావం ఈ డాక్టర్లందరిలోనూ ఉంటున్నది. వారు తమ స్వప్రయోజనాన్ని విస్మరించి ప్రేమతో సేవ చేస్తున్నారు. ప్రేమవల్లనే ప్రపంచమంతా నిలిచియున్నది. దైవమెక్కడున్నాడంటే కైలాసంలోనో, లేక, వైకుంఠంలోనో ఉన్నాడని చెప్పకూడదు. ప్రేమయే దైవం. కాబట్టి, ప్రేమతో

srisathyasaivachanamrutam

జీవితాన్ని గడపండి. ప్రేమ లేనిది మానవత్వమే కాదు. మీ దినచర్యను ప్రేమతో ప్రారంభించి, ప్రేమతో నింపి, ప్రేమతో అంత్యం గావించండి. దైవత్వానికి ఇదే రాజమార్గం! ఇలాంటి ప్రేమను ఆ డాక్టరు ప్రత్యక్షంగా ఆచరణలో చూపించాడు. అది మీరెవ్వరూ గమనించలేదుగాని, నేను గమనించాను. ఈ లోకంలో గొప్పగొప్ప డిగ్రీలు పొందిన డాక్టర్లనేకమంది తమగురించి తాము గొప్పగా అడ్వర్‌టైజ్ చేసుకుంటూ పేరుప్రఖ్యాతులకోసం ప్రాకులాడుతున్నారు. కాని, మా డాక్టర్లు సేవకోసం పాటుపడతారే తప్ప అడ్వర్‌టైజ్ చేసుకోరు, పేరు ప్రఖ్యాతుల నాశించరు. ఇలాంటి త్యాగమూర్తులైన డాక్టర్లు ఉండటంచేతనే ఈ ఆసుపత్రి ఇంత గొప్ప పేరు సంపాదించింది.

## క్రొత్త జనరల్ ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన

ఈ హాస్పిటల్‌లో స్థలం చాలా తక్కువగా ఉన్నదని నేను గమనించాను. ఇక్కడున్న ఐదెకరాల స్థలాన్ని ఈ ఆసుపత్రి పూర్తిగా ఆక్రమించుకుంది. ఒక్క ఇంచైనా ఖాళీ లేదు. ఇక్కడ నాల్గు ఆపరేషన్ థియేటర్లున్నాయి. కనుకనే, నేనిప్పుడు ఇక్కడికి వచ్చే ముందు క్రొత్త జనరల్ ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేసి వచ్చాను. కర్ణాటక ముఖ్యమంత్రి కూడా వచ్చాడు. అక్కడ పది ఎకరాల స్థలాన్ని మన ఆదికేశవులు ఇచ్చాడు. సాధారణంగా నేను శంకుస్థాపనకు పోను; ఏవో కొన్ని రాళ్ళు వేసి రావటం నాకిష్టం లేదు. ప్రారంభోత్సవమే నాకు చాలా ముఖ్యం. కనుక, ఈ ఆసుపత్రిని ప్రారంభించే తేదీనికూడా ముందుగానే నిర్ణయించాను. “అయ్యా! ఈ తేది కాదు ముఖ్యం. దీనిని ప్రారంభించే తేదీయే నాకు ముఖ్యం. నవంబరు 23న దీనిని ప్రారంభించాలి” అని చెప్పాను. అక్కడ జనరల్ ఆసుపత్రిని కట్టిస్తే మరి ఈ హాస్పిటల్ ఏమౌతుంది? ఇది ప్రారంభంలో చిన్న విత్తనంగా ఉండి ఇప్పుడొక మహావృక్షంగా పెరిగిపోయింది. ఇది ఇంకా పెరుగుతుంది. పెరుగుతూనే ఉంటుంది. నా ఉద్దేశ్యమేమిటంటే ఈ ఆసుపత్రిని మాతాశిశు ఆరోగ్యకేంద్రంగా మార్చి, అక్కడ అన్ని హంగులతో కూడిన జనరల్ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి. మాతాశిశు సంక్షేమంపైననే ప్రపంచమంతా ఆధారపడియున్నది.

## తల్లిదృష్టికి నోచుకోనివారు దైవదృష్టికి నోచుకోలేరు

తల్లిప్రేమకు నోచుకున్న పిల్లలే దైవానుగ్రహానికి పాత్రులు కాగలరు. మీకు తెలుసు –

srisathyasaivachanamrutam

ధృతరాష్ట్రుని ధర్మపత్నియైన గాంధారి తన భర్త గ్రుడ్డివాడని తానుకూడా కళ్ళకు గంతలు కట్టుకుంది. తన పుత్రులనుకూడా ఆమె ఏనాడూ చూడలేదు. యుద్ధంలో కౌరవులు నూరుమందీ మరణించగా కృష్ణుడు గాంధారీ ధృతరాష్ట్రులను ఓదార్చే నిమిత్తం వెళ్ళాడు. కాని, గాంధారి పట్టలేనంత కోపంతో "కృష్ణా! మా నూరుమంది పుత్రులలో మాకు తద్దినం పెట్టటానికి కనీసం ఒక్కడినైనా లేకుండా చేశావు కదా! నా పుత్రులందరూ మరణించటంవల్ల నీకు వచ్చిన లాభమేమిటి? నీ అనుగ్రహదృష్టి నా కుమారులపై ఎందుకు ప్రసరించలేదు?" అని ప్రశ్నించింది. అప్పుడు కృష్ణుడు ఆమె మళ్ళీ నోరెత్తటానికి వీల్లేని విధంగా చక్కని సమాధానమిచ్చాడు. "అమ్మా! నీ పిల్లలను నీవే చూడలేదు. తల్లిదృష్టికే నోచుకోని పిల్లలు దైవదృష్టికి ఏరీతిగా నోచుకోగలరు?" అన్నాడు. వేదము "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ...." అని తల్లికి ప్రప్రథమ స్థానమును అందించింది. కనుక మొట్టమొదట మీరు తల్లిప్రేమకు పాత్రులు కావాలి.

**విద్యను పంచాలి, అమ్ముకోకూడదు**

అనాది కాలమునుండి భారతదేశంలో త్యాగమూర్తులు ఉద్భవిస్తూ రావటంచేతనే భారతదేశం ఈనాడు ఇంత సుక్షేమాన్ని అనుభవించగల్గుతోంది. భారతదేశంలో ఉన్న త్యాగము, సత్యము, ధర్మము ఇంకెక్కడా లేవు. ఇది త్యాగభూమి, యోగభూమి, కర్మభూమి, యజ్ఞభూమి. ఇలాంటి పవిత్రభూమిని ఆధునిక యువత భోగభూమిగా మార్చుటకు ప్రయత్నిస్తోంది. మనకు భోగమే వద్దు, త్యాగమే కావాలి. త్యాగంవల్ల లభించే ఆనందం భోగంవల్ల లభించదు. భోగం రోగాన్ని అందిస్తుంది. త్యాగం యోగాన్ని చేకూర్చుతుంది. మీరు నేర్చిన విద్యను త్యాగభావంతో పదిమందికి పంచాలేగాని, అమ్ముకోకూడదు. అదే గొప్ప సేవ. ఎక్కడైనా ఎవరైనా బాధపడుతున్న దృశ్యం మీ కంట పడితే, వారి బాధను నివారణ గావించటానికి మీ శక్తికొలది ప్రయత్నం చేయండి. ఇట్టి పవిత్రమైన ఉద్దేశ్యంతోనే డాక్టర్ రాజేశ్వరి తాను సంపాదించిన డబ్బంతా ఈ ఆసుపత్రికే వినియోగించింది. ఆమెకు ప్రతిబింబంగా ఉన్న సావిత్రికూడా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తోంది. "సావిత్రీ! నీవు అన్నం తినకుండా పనిచేస్తూ ఉంటే నీ గతి ఏమౌతుంది? నీవేరీతిగా సేవ చేయగలవు? కాబట్టి, నీవు వేళకు భోజనం చేయి, తరువాత ఏ పనైనా చేసుకో" అని చెప్పాను. ఈమేరకు ఆమె వద్దనుండి వాగ్దానం తీసుకున్నాను.

srisathyasaivachanamrutam

## “వైద్యో నారాయణో హరిః”

ఇక్కడ పని చేసేవాళ్ళందరూ ఎలాంటివారో తెలుసునా? మీకెవ్వరికీ చెప్పరుగాని, ఒక్కరూ ఒక్క నయాపైసా తీసుకోరు. గత 25 సంవత్సరాలుగా ఇక్కడ పని చేస్తున్న డాక్టర్లుగాని, వచ్చిపోయే విజిటింగ్ డాక్టర్లుగాని ఒక్క నయాపైసా తీసుకోకుండా తమకు కావలసిన పరికరాలను తామే తెచ్చుకొని, పేషంట్లకిచ్చే మందులనుకూడా తామే తీసుకువచ్చి ఆనందంగా సేవ చేస్తున్నారు. కాని, ఇట్టి త్యాగభావంతో రోగులకు సేవ చేసేవారు చాలా అరుదుగా కనిపిస్తున్నారు. తపస్సుగాని, తీర్థయాత్రలుగాని, జపధ్యానాదులుగాని ముక్తినీయలేవు. సంసార సాగరమును తరించాలంటే సజ్జనులకు సేవ చేయాలి. సేవ చేసేవాడే నిజమైన వైద్యుడు. “వైద్యో నారాయణో హరిః”, వైద్యుడు నారాయణ సమానుడు. నారాయణుడేమి చేస్తున్నాడు? అందరికీ సహాయం చేస్తున్నాడు. అదేరీతిగా, వైద్య నారాయణులుకూడా అందరికీ సహాయం చేయాలి. అలాంటి త్యాగమూర్తులైన వైద్యులు ఇక్కడ చేరటంచేతనే ఈ ఆసుపత్రి ఎంతో అభివృద్ధికి వచ్చి, గొప్ప పేరు పొందింది. పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కార్డియాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, ఆఫ్తాల్మాలజీ విభాగాలు ఉన్నాయి. ఇక్కడనుండి హేమంత్ అనే కంటి డాక్టరు వారానికొకసారి అక్కడికి వచ్చి ఆపరేషన్లు చేస్తుంటాడు. వారంవారం ఇక్కడినుండి పుట్టపర్తికి వచ్చి సేవ చేయటం సామాన్యమైన విషయం కాదు. అనీస్తిటిస్టులు (మత్తు ఇచ్చే వైద్యనిపుణులు)కూడా ఇక్కడినుండి వచ్చి సేవ చేస్తున్నారు. అక్కడ ఆపరేషన్లు అధికసంఖ్యలో జరుగుతున్నప్పుడు ఇక్కడినుండి అనీస్తిటిస్టులు రావలసిన అవసరం ఏర్పడుతుంది. అక్కడినుండి ఒక్కసారి ఫోన్ చేస్తే చాలు, పరుగెత్తుకొని వస్తారు. ఇలాంటి డాక్టర్లు చిక్కటమే చాలా కష్టం. నేను హేమంత్‌తో చెప్పాను, తనకు కావలసిన పరికరాలు ఏవో చెబితే వాటిని తక్షణమే తెప్పిస్తానని. పని చేసేవారికి నేనెంతైనా ఉత్సాహప్రోత్సాహాల నందిస్తాను. అదే నాకు ఆనందం. నాకు డబ్బుతో పని లేదు. సాయిబాబాకు డబ్బు ఎక్కడినుండి వస్తుంది? సృష్టిస్తాడా? అని మీరనుకుంటారు. కాని, నాకలాంటి చెడ్డబుద్ధులు లేవు. ఎందుకంటే డబ్బు ప్రభుత్వానికి సంబంధించినది. ఏ వస్తువునైనా నేను సృష్టిస్తాను కాని, డబ్బును మాత్రం సృష్టించను. డబ్బు అవసరమైనప్పుడు ఆ సమయానికి ఎవరికో ఒకరికి ఇవ్వాలని బుద్ధి పుడుతుంది. స్వామి ఒక్కమాట చెబితే చాలు, ఆఘమేఘాల మీద పని జరిపించే భక్తులు

srisathyasaivachanamrutam

దేశవిదేశాలలో అనేకమంది ఉన్నారు. కాబట్టి మీకేమి కావలసినా అడగటానికి సందేహించకండి. ఈ హాస్పిటల్‌ను మనం ఇంకా అభివృద్ధి చేయాలి. నిన్న ఒక లివర్ స్పెషలిస్టు వచ్చి "స్వామీ! నేనిక్కడ ఉండి లివర్ ట్రాన్స్‌ప్లాంటు ఆపరేషన్లు చేస్తాను" అన్నాడు. "నాయనా! చేస్తే వద్దంటానా? మంచికి నేనెప్పుడూ సిద్ధంగానే ఉన్నాను. తప్పక చేయి" అని చెప్పాను.

**మా హాస్పిటల్స్‌లో డాక్టర్లు నవ్వుతూ పనిచేస్తుంటారు**

ఈనాడు మనం తినే తిండి, త్రాగే నీరు, పీల్చే గాలి అన్నీ కలుషితమైనాయి. కలుషితమైన ఆహారపానీయాదులవల్ల గుండె, లివరు చెడిపోయి అనేక జబ్బులు వస్తున్నాయి. పూర్వం ఇన్ని జబ్బులు లేవు. కనుకనే నేను సాధ్యమైనంతవరకు ప్రజలకు పరిశుద్ధమైన నీరును అందించి వారి ఆరోగ్యాలను కాపాడాలని కంకణం కట్టుకున్నాను. పిల్లలకు ఎడ్యుకేషన్ (విద్య) చాలా ప్రధానమైనది. కనుకనే మొట్టమొదట పిల్లలకోసం విద్యాసంస్థలను ప్రారంభించాను. ఆరోగ్యంకూడా అత్యవసరం కాబట్టి, వైద్యసంస్థలను నెలకొల్పాను. తరువాత త్రాగునీటి పథకాలను చేపట్టాను. ఏవిధంగా? ఏవో చిన్నచిన్న బోర్‌వెల్స్ వేయించటంద్వారా కాదు. ఎందుకంటే, బోర్‌వెల్స్‌నుండి వచ్చే నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉంటోంది. కనుకనే కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ప్రవాహాల నుండి నీరు తెప్పించి ప్రజలకిచ్చాను. కృష్ణానదినుండికూడా తెప్పించాను. ఎక్కడ నీరు లేక ప్రజలు బాధపడుతున్నారో అక్కడ నీటి సౌకర్యం కల్పించాలి. మనమేమీ గొప్పగా ధనమివ్వనక్కర్లేదు. త్రాగటానికి గ్రుక్కెడు మంచినీళ్ళిస్తే చాలు; వారెంతో ఆనందిస్తారు, ఆరోగ్యాన్ని పొందుతారు. దేశంలో ఎంతోమంది శ్రీమంతులున్నారు. కాని, ఎంతమంది తమ సంపదను ఇట్టి సత్కార్యాలలో వినియోగిస్తున్నారు? పోయే సమయంలో పిడికెడు మట్టినైనా వెంట గొనిపోరు. పోయేవాళ్ళందరూ మట్టిని తీసుకుపోతే భారతదేశంలో మట్టికికూడా 'రేషన్' వచ్చియుండేదేమో! సంపాదించిన డబ్బునంతా వదలిపెట్టిపోక తప్పదు. మీ దేహాన్నే మీరు వదలిపెట్టిపోతారు. అలాంటప్పుడింక సంపాదించిన డబ్బు ఎలా వెంట రాగలదు? కాబట్టి, ఆ డబ్బును సత్కార్యాలలో ప్రవేశపెట్టాలి. మా హాస్పిటల్స్‌లో చేరిన డాక్టర్లందరూ అలాంటి త్యాగభావంతోనే పనిచేస్తున్నారు. అందరూ నవ్వుతూ, నవ్వుతూ పని చేస్తుంటారు; ఎవ్వరూ 'కేస్ట్రాయిల్ ఫేస్' పెట్టరు.

sri sathyasai vachanamrutam

## దైవంతో సంబంధమేర్పర్చుకోవటమే సత్సంగం

ముఖ్యంగా మీరు చేయవలసిందేమిటంటే, దైవంతో సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని పెట్టుకోవాలి. అగ్నిసంపర్కంచేత పనికిరాని పుల్లకూడా అగ్నిగా మారినట్లు, మీరు దైవంతో సంబంధం పెట్టుకున్నప్పుడు దైవశక్తి మీలో ప్రవేశిస్తుంది. దైవంతో సంబంధమేర్పర్చుకోవటమే నిజమైన సత్సంగం.

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః**

కాని ఈనాటి మానవునికి నిశ్చలమైన భావం లేనే లేదు. ఎప్పుడు చూసినా అతని మనస్సు పిచ్చికోతిమాదిరి ఎగురుతూ దూకుతూ ఉంటుంది. "ఇది నా దేహం, నేను దేహం కాదు. ఇది నా మనస్సు, నేను మనస్సు కాదు. అయితే నేనెవరిని?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము... వీటన్నింటికంటే 'నేను' అనేది వేరుగా ఉంటున్నది. ఇది కూటిపేద మొదలు కోటీశ్వరునివరకు అందరియందున్నది, అన్నింటికీ సాక్షీభూతంగా ఉన్నది. ఇట్టి తత్త్వాన్ని గుర్తించాలంటే త్యాగభావాన్ని పోషించుకోవాలి.

ఈ ఆసుపత్రిలో జాతిమత భేదాలకు తావులేదు. ఇక్కడికి ఎంతోమంది హిందువులు వస్తుంటారు, క్రిష్టియన్లు వస్తుంటారు, మహమ్మదీయులు వస్తుంటారు. అందరినీ సమానంగా చూస్తున్నాము. ఎందుకంటే, అందరూ ఒకే తండ్రి బిడ్డలే. మానవ సోదరత్వమును, దైవపితృత్వమును విశ్వసించినప్పుడు మనం దేనినైనా సాధించవచ్చు. సాయిసంస్థల్లో ఎలాంటి భేదాలకూ తావు లేదు. సాయిసంస్థలకు చెందిన సేవాదళ్ సభ్యులు ఎంతోమంది ఇక్కడికి వచ్చి సేవ చేస్తున్నారు. ఇక్కడి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోజుకు నూరుమంది సేవాదళ్ సభ్యులు సేవ చేస్తున్నారు. ఇట్టి త్యాగభావం యువకులలో ప్రారంభం కావాలి. వయస్సు పెరిగినకొలదీ త్యాగభావం కూడా పెరుగుతూ రావాలి.

ప్రేమస్వరూపులారా! ఈనాడు ఈ హాస్పిటల్‌యొక్క సిల్వర్‌జూబ్లీ ఉత్సవాన్ని జరుపుకుంటున్నాము. కాని, దీనితో మనం సంతృప్తిపడకూడదు. దీనిని ఇంకా బాగా

sri sathyasai vachanamrutam

అభివృద్ధిపరచి గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాన్ని జరుపుకోవాలి. అప్పటికి క్రొత్త డాక్టర్లు అనేకమంది ఇందులో చేరాలి. అందరూ కలసిమెలసి పనిచేయాలి. ఐకమత్యంతో ఎంతటి ఘనకార్యమైనా సాధించవచ్చు. రాజేశ్వరి ప్రారంభించిన చిన్న ఆసుపత్రి ఈనాడింత పెద్దదిగా మారిపోయింది. దీనినింకా బాగా అభివృద్ధిపరచి బీదలకు తగినరీతిగా సహాయం చేయాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(10.06.2001 ఉదయం వైట్‌ఫీల్డ్‌లోని శ్రీ సత్యసాయి జనరల్ హాస్పిటల్‌లో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vachanamrutam